
పాతూరులో వేళాడుతున్న విద్యుత్ తీగలు చూపిస్తున్న రైతు


వంగిన విద్యుత్ స్తంభాలు

# సారూ.. కరెంట్ తీగలు సరి చేయరూ

మెదక్ రూరల్, జూన్16: వేళాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు. చేతికి అందేంత ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను, స్తంభాలు ఏర్పాటు చేసి సరి చేయాలన్నారు. ఇష్టారీతిలో స్తంభాలు వేసి అధికారులు చేతులు దులుపుకొన్నారు. వాటిని నిరంతరం పర్యవేక్షించడం లేదు. దీంతో తరచూ విద్యుదాఘాతానికి గురైతున్నా, సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నా దాఖలాలు లేవు. దీంతో రైతులు పొలాలకు వెళ్లలంటే జంకుతున్నారు. ఈ సమస్యలపై చర్యలుతీసుకోవాలని కోరుతున్నా పట్టించుకునే నాథుడు కనిపించడంలేదు. మండలంలోని పాతూరు, మక్తా భూపతిపూర్, బాలనగర్‌లో ఆయా గ్రామాల్లోని పొలాల్లో కొన్ని నెలలుగా విద్యుత్ తీగలు చేయి ఎత్తితే తాకే ఎత్తులో వేలాడుతున్నాయి.

### విద్యుత్ తీగలను సరి చేయాలి



పొలాల్లో నిలబడితే చేతికి తాకేలా విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. ట్రాక్టర్‌తో కాని పొలం పనులు చేయాలన్నా మాకు భయంగా ఉంది. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా వారు విద్యుత్ తీగలను సరి చేయడం లేదని అవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు పట్టిం చుకుని రైతన్నల విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి. ప్రాణనష్టం జరిగిన తర్వాత చర్యలు తీసుకుంటే ఏం లాభం.

**- బాలయ్య, రైతు, పాతూరు**

# దుర్గమ్మ చల్లగా చూడు తల్లి


పూజాలు అందుకుంటున్న వనదుర్గమాత


క్యూలైన్‌లో భక్తుల సందడి

పాపన్నపేట్, జూన్ 16: ఏడుపాయల వన దుర్గాభవానీ మాతను ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మంజీరా నదిలోని పాయల్లో పుణ్య స్నానాలు చేసి, దుర్గామాతాను ఆదివారం దర్శించుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు, తలానీలాలు, బోనాలు సమర్పించి మొక్కుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా దేవాదాయ డిప్యూటి కమిషనర్ వినోద్‌రెడ్డి, ఆలయ చైర్మన్ సతెల్లి బాలగౌడ్, రవివీర్‌కుమార్, సూర్యశ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నర్సింలు, వరుణాచారి, రాజు, యాదగిరి, శ్రీకాంత తదితరులు ఏర్పాట్లు చేశారు. వేద పండితులు శంకరశర్మ, పార్థివశర్మ, మురళీధర్, రాజశేఖర్ తదితరులు పూజలు చేశారు. పాపన్నపేట్ ఎస్సై నరేశ్ బందోబస్తుచర్యలు చేపట్టారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


కోనాపూర్ ప్రభుత్వ పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ సమావేశం

రామాయంపేట, జూన్ 16: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతున్నదని హెచ్ఎం రవీందర్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని కోనాపూర్ ప్రభుత్వ పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ బడుల్లోనే తమ పిల్లలను చేర్చాలని, నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

## రామాయంపేట సీఐగా వెంకట రాజాగౌడ్


వెంకటరాజాగౌడ్

రామాయంపేట, జూన్ 16: రామాయంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వెంకట రాజాగౌడ్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన వెంకటేశ్‌ను హైదరాబాద్ ఐజీ కార్యాలయంలోని మల్టీ జోన్ 1కు వెళ్లారు. వెంకట రాజాగౌడ్ సంగారెడ్డి జోన్ ఏసీబీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించారు.

# బైక్ ప్రమాదంలో మహిళ మృతి


శారద (ఫైల్)

రామాయంపేట, జూన్ 16: ద్విచక్ర వాహనంపై నుంచి పడిన మహిళకు తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ, పరిస్థితి విషమించడంతో మృతిచెందిన ఘటన కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ దవాఖానలో ఆదివారం జరిగింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. రామాయంపేట మండలం ఝా న్సీలింగాపూర్ గ్రామానికి చెందిన కొమ్ము శారద (52) 15 రోజుల క్రితం తన భర్తతో కలిసి బైక్‌పై వేరే గ్రామానికి వెళ్లింది. తిరుగు ప్రయాణంలో గ్రామ సమీపంలో అనుమానాస్పద స్థితిలో కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబీకులు రామాయంపేటలో చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది.

## మిషన్ భగీరథ ఇంటింటి సర్వే


సర్వేలో కార్యదర్శి ఆరిఫ్‌హుస్సేన్

నిజాంపేట,జూన్16: మండలంలోని నంది గామలో పంచాయతీ సిబ్బంది మిషన్ భగీరథ నల్లాల ఇంటింటి సర్వేను ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా కార్యదర్శి ఆరిఫ్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలతో ఇంటింటికీ తిరుగుతూ కుటుంబసభ్యుల వివరాలు, నల్లాల ద్వార మిషన్ భగీరథ నీళ్ల సరఫరా వంటి అంశాలను ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నామని తెలిపారు.

# అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సీపీఎం డివిజన్ కార్యదర్శి నాగరాజు, బాధితులు

నర్సాపూర్, జూన్ 16: కులం పేరుతో దూషిస్తూ భౌతిక దాడులకు పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీపీఎం నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి నాగరాజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం మండలంలోని మహ్మదాబాద్‌లో కొంతమంది నల్గొండ పెంటయ్య(ఎస్సీ), కృష్ణ(ఎస్సీ)లను కులం పేరిట దూషించారని ఫిర్యాదు చేశారు. పశువులు చనిపోతే చర్మం వలిచే స్థలంలో ముళ్లపొదలు పెరగడంతో వాటిని కొట్టేద్దామని వెళ్లారు. దీంతో అదే గ్రామానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్, చంద్రాగౌడ్, నరసింహాగౌడ్, సాయిగౌడ్ ఉద్దేశపూర్వకంగా అక్కడికి వచ్చి దుర్భాషలాడుతూ ఈ స్థలం మాది అంటూ అనడంతో గొడవ పెరిగింది. అధికారులు స్పందించి వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరిరు. ఫిర్యాదు చేసొన వారిలో పెంటయ్య, కృష్ణ, సాయిలు, కుమార్, రవి, లింగం, గోపాల్, నర్సయ్య ఉన్నారు.

## విద్యుత్ వైర్ల చోరీ

**- రైతుల ఆందోళన**

హుస్నాబాద్ టౌన్, జూన్ 16: వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ సర్వీస్‌వైర్లు చోరీకి గురవుతుండడంతో హుస్నాబాద్‌లోని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొంతకాలంగా వ్యవసాయ బావుల వద్ద ఉన్న బోర్లు, బావుల మోటర్లకు ఉపయోగించే విద్యుత్‌వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వీస్ వైర్లలో ఉండే కాపర్ వైర్ కోసం దొంగతనాలు జరుగుతున్నాయని రైతులు వివరిస్తున్నారు. గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరిగినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదని, దీంతో వేలాది రూపాయలు నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే వందమందికిపైగా రైతులకు సంబంధించిన సర్వీస్‌వైర్లు ఎత్తుకెళ్లినట్లు రైతులు మల్లెత్తుల ఎల్లయ్యతో పాటు పలువురు తెలిపారు. ఇప్పటికైనా పోలీసులు చర్యలు తీసుకుని రైతులకు సంబంధించిన విద్యుత్‌వైర్లు చోరీకి గురికాకుండా చూడాలని వారు కోరుతున్నారు.




# కొయ్యగుట్ట మల్లన్నకు పూజలు



మెదక్‌రూరల్, జూన్ 16: మండలంలోని మంబోజిపల్లి కొయ్యగుట్ట మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం పూజారి మల్లన్న ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు, స్వామికి ఒడిబియ్యం సమర్పించారు. పరిసర ప్రాంతాల భక్తులు ఆధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్ని, మొక్కులు చెల్లించుకున్నారు .

# చెట్ల పొదలున్నాయి.. జాగ్రత్త?


నస్కల్ నుంచి నిజాంపేట వెళ్లే రోడ్డులో చెట్లు పెరగడంతో కానరాని మూలమలుపు


చల్మెడ నుంచి నందగోకుల్ క్రాస్ రోడ్డులో చెట్లు

- **పొదలతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడక ప్రమాదాలు**
- **బిక్కుబిక్కుమంటూ వెళ్తున్న వాహనదారులు**
- **ప్రతి పల్లెకూ రోడ్లు వేసిన కేసీఆర్ ప్రభుత్వం**
- **పట్టించుకోని పంచాయతీ, ఆర్అండ్‌బీ అధికారులు**

రామాయంపేట, జూన్ 16: రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరుగుతున్న చెట్లపొదలతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయి. నిజాంపేట మండలంలోని చల్మెడ కమాన్ నుంచి నందగోకుల్, నగరం, నస్కల్ నుంచి రాంపూర్ వరకు ఇదే పరిస్థితి. ఈ రోడ్డు సుమారు 20 కిలోమీటర్ల వరకు ఉంటుంది. ఈ రోడ్డు వెంట వెళ్తున్న ప్రతి వాహనానికి ఇబ్బందులు తప్పడంలేదు. దీనికి తోడు ఎన్నో మూలమలుపులు. ఎక్కడి నుంచి ఏ వాహనం వస్తుందో తెలియదు. కనీసం మలుపుల వద్ద సూచిక బోర్డులు కూడా లేవు. పల్లె ప్రాంతాలే దేశానికి పట్టుగొమ్మలని కోట్లాది రూపాయలతో కేసీఆర్ ప్రభుత్వం రోడ్లు వేసింది. రామాయంపేట నుంచి రోజూ వందలాది మంది వ్యాపారస్తులు ద్విచక్ర వాహనాలు, ప్రయాణికుల ఆటోలు, ఆర్టీసీ బస్సులు ఈ ప్రాంతం గుండా నడుస్తాయి. ఒక వాహనం వస్తుందంటే ఆ వాహనం పోయేవరకు ఎక్కడో ఓ దగ్గర స్థలం ఎక్కువ చూసుకుని ఎదురుగా వచ్చే వాహనం వెళ్లేవరకు నిలపాల్సిందే. లేకుంటే ప్రమాదం జరగడం ఖాయం. ద్విచక్ర వాహనాలు, ఆటోలకు ప్రమాదాలు మాత్రం తప్పడం లేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రోజూ ఆ దారి గుండా వెళ్తున్న ప్రజలు, వ్యాపారస్తులకు ప్రమాదాలు జరుగకుండా ఏపుగా పెరిగిన చెట్ల పొదలను తొలిగించాల్సిన అవసరం ఉంది.



సూచిక బోర్డుకూడా లేని రాంపూర్ వెళ్లే దారిలోని మూలమలుపు


నస్కల్ వెళ్లే దారిలో ఏపుగా పెరిగిన చెట్లు

# సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిన




నర్సాపూర్, జూన్16: మున్సిపాలిటీలోని 14వ వార్డులో జరుగుతున్న సీసీ రోడ్డు, డ్రైనేజ్ పనులను మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్ ఆదివారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపించకుండా చూసుకోవాలని కాంట్రాక్టర్, ఇంజినీర్ భూపాల్‌ను ఆదేశించారు. పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఆయనతో కౌన్సిలర్ సరితా ఆంజనేయులుగౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

# గో సంరక్షులను విడుదల చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మండల బీజేపీ నాయకులు

పెద్దశంకరంపేట, జూన్ 16: గోవులను సంరక్షించాలని కోరుతూ సంఘీభావం ప్రకటించిన బీజేపీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేయడం సమంజసం కాదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోనం విఠల్ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గోవులను సంరక్షించాలని హైకోర్టు ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్య వహరించడం మంచిది కాదన్నారు. నిన్ని మెదక్‌లో జరిగిన ఘటనలో పోలీసులు బీజే పీ నాయకులు, గోసంరక్షులను అరెస్ట్ చేశారన్నారు. హైకోర్టు ఉత్తర్వులను ప్రభుత్వం, పోలీసులు పాటించాలన్నారు. ఆయనతో నాయకులు సూర్యప్రకాశ్, అశోక్, శ్రావణ్, మంగళి కృష్ణ, శ్రీహరి, తదితరులున్నారు.

# బాధిత కుటుంబాలకు అండగా ఉంటా


ఆర్థికసాయం చేస్తున్న జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా

శివ్వంపేట, జూన్ 16: బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా అన్నారు. శివ్వంపేటలో కుంట మహేశ్ కొద్దిరోజులుగా కాలు విరిగి ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకుని జడ్పీటీసీ ఆదివారం పరామర్శించారు. రూ. 5 వేల ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని రెడ్యాతండా పంచాయతీ వెంక్యతండాలో బానవత్ నర్సింగ్ భార్య మృతిచెందింది. కుటుంబసభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయంతో పాటు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. వారికి తానున్నానని ధైర్యం చెప్పారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు పత్రాల శ్రీనివాస్‌గౌడ్, రంగీల ఆంజనేయులు, సీనియర్ నాయకులు పద్మావెంకటేశ్, ముద్దగల్ల లక్ష్మీనర్సయ్య, భాస్కర్‌నాయక్, పోచాగౌడ్, కొండల్, ముద్దగల్ల రాజు, తదితరులు ఉన్నారు.

## ఎమ్మార్పీఎస్ సమావేశానికి తరలిరావాలి

### జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్

సిద్దిపేట టౌన్, జూన్ 16: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 19న నిర్వహించనున్న సమావేశానికి భారీగా తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్న ట్లు తెలిపారు. ఈ సమావేశానికి సిద్దిపేట జిల్లా నుంచి భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా మేడి పాపన్న హాజరవుతారన్నారు. సమావేశంలో ప్రధానంగా విద్యా హక్కు చట్టం అమలు, కార్యాచరణ అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

# నిబంధనల ప్రకారమే బక్రీద్ జరుపుకోవాలి


మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, పాల్గొన్న అధికారులు

## -కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, జూన్ 16(నమస్తే తెలంగాణ): నిబంధనల ప్రకారమే బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకొనేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఆదివారం బక్రీద్ నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఎస్పీ బాలస్వామి, అడిషనల్ ఎస్పీ మహేందర్‌తో కలిసి రెవెన్యు, పశు సంవర్థక, మున్సిపల్, పంచాయతీ, ట్రాన్స్‌పోర్ట్, పోలీస్ అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా చాలా ప్రశాంతమైన ప్రాతమని, మాత సామరస్యానికి చిహ్నమన్నారు. సంస్కృతిని కొనసాగించి ప్రజలందరూ శాంతిభ్రతలను కాపాడటానికి సహకరించాలని కోరారు. జిల్లా ఎస్పీ బాలస్వామి మాట్లాడుతూ జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని కోరారు. సమావేశంలో జిల్లా పశు సంవర్థక అధికారి డాక్టర్ విజయ శేఖర్‌రెడ్డి, జిల్లా రవాణాశాఖ అధికారి వెంకటస్వామి, మున్సిపల్ కమిషనర్ జానకీరామ్, తహసీల్దార్ మహేందర్ గౌడ్, పోలీస్, పంచాయతీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### ప్రజావాణి రద్దు

మెదక్ అర్బన్, జూన్ 16: బక్రీద్ పండగ సందర్భంగా ప్రభుత్వ సెలవు అయినందున నేడు నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సోమవారం ఫిర్యాదులు చేసేందుకు కలెక్టరేట్‌కు రావద్దని ఆయన పేర్కొన్నారు.

## ఎస్సైపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఫిర్యాదు


మాట్లాడుతున్న బాధిత రైతులు

శివ్వంపేట, జూన్ 16: తమ భూమి విషయంలో ఎస్సై మహిపాల్‌రెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని బాధిత రైతులు వాపోయారు. ఎస్సైపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్పీ, డీఎస్పీ, సీఐకి ఆదివారం ఫిర్యాదు చేశామని పెద్దగొట్టిముక్క గ్రామానికి చెందిన రైతులు పెంటారెడ్డి, సత్తిరెడ్డి, నర్సారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలోని తమ భూ వివాదంలో ఎస్సై మహిపాల్‌రెడ్డి కల్పించుకుని బాధితుల పక్షాన నిలబడకుండా తమపై దౌర్జన్యం చేన్నాడని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు.



### వృద్ధాశ్రమంలో అన్నదానం

నర్సాపూర్, జూన్ 16: నర్సాపూర్ మున్సిపాలిటీలోని విజన్ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో ఆదివారం దాతలు వృద్ధులకు అన్నదానం చేశారు. నిర్వాహకురాలు అభర్ణ, సిబ్బంది హరీశ్వర్‌రెడ్డి, దాతలు సువర్ణావీరారెడ్డి, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
సిద్దిపేట/గజ్వేల్/తూప్రాన్/మెదక్ : 80966 77663
సంగారెడ్డి/జహీరాబాద్/నారాయణఖేడ్ : 9182777658
పటాన్‌చెరు : 80966 77657